# నల్ల పూసలు

"అబ్బయా! నేను నిజం సెబుతుండా!

నేను తప్పు సెయ్యనేదు. నాకు ముగ్గురితో మనువాయ. మూడు తావల సంసారమాయ. అయినా నేనేం తప్పు సెయ్యలా. నేను నిప్పులాంటిదాన్నబ్బయ్యా. ఆఁ నిజమే. నేను కల్లు దాగినా. వొగిటిగాదు. మూడు ముంతలు దాగినా. కల్లు దాగడం మాకు తప్పుకాదబ్బయ్యా. మీరు ఇంటికొచ్చే సుట్టాలకు ఎట్ల టీలు కాపీలు యిస్తారో, అట్లమేం కల్లుముంతలిస్తాం. అది మా ఆశారం. సత్తెపెమాణకంగా సెప్తాండ. కల్లు మాకు వొగవొంటకం. అందుకే మూడుపూట్లా పుస్టుగా తాగతాం. తాగినోడినోట్లో నిజ్జింతన్నకొస్తాదంటారు గదా. యిప్పుడు నా నోట్లోను తన్నకొస్తా వుండాది.

ఇద్దో ఈదిలో పోతావుండే అబ్బయ్యలూ! యినుకోండి. కండ్లు కావరం బట్టి సెప్పటంలా. కల్లుకు కండ్లు తిరిగి సెప్పటంలా. అన్నీ యిడిసేసి ఈదిన బడీ సెప్పటంలా. ఎన్నొదినాల్నించీ సెప్పుకోవాల సెప్పుకోవాలని వున్నింది. సెప్తాండ. గుండెలమింద బరువు దించుకోవాలని సెప్తాండ. కానీ నా సంసార గుట్టు ఎట్ల సెప్పేది? అయినా సెప్తాండ. ఇద్దో నా మెడలో వుండె నల్లలమింద పెమాణకంగా చేసి సెప్తాండా. నిజమే సెప్తా. ఏదీ ... నల్లలంటే తేలీదా. అయ్యో అబ్బయ్యా నల్లలంటే నల్లపూసల పుస్తె ... నా మెడలో పెద్ద మిడత మాదిరి యేలాడతా వుండాది సూడు బంగారు పుస్తి. దానికీపక్కా ఆపక్కా నల్లపూసలుండాయి గదా. ఈట్ని సేత్తోపట్టుకోని మరీ సెప్తాండా. నాసంక నుండే నా అయిదేండ్ల పిల్లోనిమింద వొట్టు బెట్టి మరీ సెప్తాండ. యినుకోండి. నా గురించి, నా కులం కట్టుబాట్ల గురించీ, నేను బతికిన బతుకు గురించీ అన్నీ సెప్తా యినుకోండి.

అవునండయ్యా! నేను ముగ్గురి మొగోళ్ళకు కాపరం జేసినా. అయినా నేనేం తప్పు సెయ్యనేదు. నేను నిప్పులాంటి మడిసినే. ఇద్దో. ఈ పీలేరు ఇలాకాలో, అట్ట కల్లూరు పులిచెర్ల నించీ, ఇట్ల కలికిరి కందూరు వాయల్పాడు దాంకా మా వోళ్ళ నెవుర్నయినా సరే. అడిగి యిశార్న చేసుకోండి. నేను సెప్పేది అబద్దమో నిజమో తెలిసిపోతాది. నేను సచ్చినా అబద్ధం సెప్పనండయ్యా. ఆకాశం సాచ్చిగా, ఈ భూమమ్మా సాచ్చిగా, నాకు జల్మనిచ్చిన తల్లి సాచ్చిగా మా నాయన సాచ్చిగా నిజమే సెప్తానండయ్యా.

అప్పట్లో మా అయ్యకు రెండు కుడతల సేనుండె. ఊరి మద్దెన గుడిసుండె. నా సిన్నప్పటిమాట. నేను పుట్టిన అయిదేండ్లకు మా యమ్మ కాలమైపాయనంట. అప్పటి కాలంలో మా అయ్య మా యమ్మకు ఇరవై రూపాయలు ఓలిగాను, రెండు పెద్ద తాటి బుట్టలు, వొగ పంది పిల్ల, కడవడు కల్లు యినాముగాను యిచ్చి మనువాడినాడంట. మాయమ్మ మరణమైపోయింతర్వాత, నా కోసరమని మా అయ్య మారు మనువు సేసుకునేదానికి యిష్టపడక

నన్ను కండ్లల్లో పెట్టుకోనిసాకె. కింద పెడితే మన్నయితాది, పైన బెడితే గెద్దయెత్తక పోతాదన్నిట్టు సూసుకునె. నాకు వయసు పెరిగే గుందికీ నాలో అందమూసందమూ రాబట్టె. అడిగినంత ఓలి, యినాములు యిచ్చి సేసుకుంటామని శ్యానామందే వచ్చిరి. కానీ వోళ్ళల్లో నిజ్జింగా నా మింద మొఖుసుబడి వొచ్చినోళ్ళు యిద్దురే. యాదన్న, అజ్జప్ప. అజ్జప్పంటే నాగ్గూడా కొంచెం బెమతుండె. అట్ల పదారేండ్ల పాయానికే, ఊర్లో వుండే పిలగోళ్ళంతా నన్ను జూసి శ్యానా యిదయి పోతా వుండ్రి. కడాకు మా వూరి సర్పంచి గెంగినాయుడు గూడా నన్ను జూసి నవ్వబట్టె. మంచిగా పలకరించబట్టె. నేను శ్యానా ఇచ్చిత్రక పోతావుంటి. వోళ్ళను జూస్తావుంటే నాగ్గూడా బోకుశాలగానే వుండెలే.

వొగదినం, మా నాయన్తోబాటు ఊరికుత్తరానుండే మామిడి తోట్లోకి ఉడతలు పట్టేదానికి పోతి. ఆడ మా నాయన అయిదారు ఉడతలు కొట్టి నా సేతికిచ్చి, కల్లు దాగొచ్చేదానికని పీలేరుకు బోయ. నేను సేన్ల గెనాలింటీ సరసరాని యలబారొస్తావుంటి. అప్పుడెదురాయ అబ్బయా అమిడిమేళం ముండాకొడుకు గెంగినాయుడు. ఏమంటా సెబుదు అబ్బయా. మీరు నిజం సెప్పినా యింటరు. అబద్దం బొంకినా యింటరు. ఆయప్ప మీసాలు, కండలు సూసే గుందికి నా గుండికాయలు నీరైపోయినాయనుకోండి. ఆడ వొంటిదాన్ని జేసి నా భుజాన సెయ్యేశ. అది సయించలేక దవడకు బట్టి వొగనూకు నూకితి.

"అరగాసు నా బట్ట! యింగెబ్బుడన్నా నా జోలికొచ్చినావా నాశనమై పోతావు. జాగర్త!" అని సెప్పి వచ్చేసినా.

ఇట్లాంటి సమీంలోనే యాదన్న రెండు వేలు, వొగ పంది పిల్లను మా నాయనకు ఓలిగా యిచ్చి, మావోళ్ళందరికీ కల్లు తాపించి నన్ను మనువాడె. వోడు నన్ను బాగానే సూసుకుంటావుండె. కానీ పెండ్లయ్యి సంవత్సరమైనా నా కడుపు పండలా. ఏం జేస్తును సెప్పబ్బయా? ఎందరో దేవతలకు మొక్కితి. గుడులు తిరిగితి. ఆ పరమాత్ముడికి మీరు దీసికడితి. అయినా సంతుగలగలే. తిరుమల కొండకు నడిసి పొయ్యి దారింటీ సెట్లకు రాతి ఉయ్యాళ్ళు గట్టి ఊపితి. అయినా సంతు గలగలా. ఊర్లో అందురూ గొడ్డుబోతు దానా అంటా అనబట్రి. కడాకు నాయింటోడు "వొసే సంతును కనలేని దయ్యమా, ఆడ యాడన్నా బొయ్యి సావే సిత్తరిముండా" అంటా వొగిటే గోకటారంభించె. దానికి తోడు మా ఆయన్ను ఎవురో "నీకు మొగతనముంటే బిడ్డెందుకు పుట్టదురా కొజ్జా నా కొడకా" అన్నేరంట. దాంతో ఆయప్ప నాకు మగతనముండాదని లోకానికి సాటుకునేదానికని వొగ దినం నన్ను దెగ్గిరికి పిల్చె. పిల్చి యేమనే? "వసే. గాట్లో గెడ్డితో కడుపు నిండకపోతే గొడ్డు సేన్లో నన్నా బడి ఎవ్వురూ గానకండా పైరుమేసేసి కడుపు నింపుకోవాల. తెలీకపోతే యెట్టనే. అది గూడా నేనే సెప్పాల్నా" అనె.

"తుః ... నీ జిమ్మడజినగా. ఎంత మాటంటివిరా పర్దేసినా బట్ట. అంత వగాతగా లేనోడివి ఎందుకు కట్టుకుంటివి. ఈ మాట ఎందుకంటివి. దానికంటే ఆడ యాడన్నా బడి

సావరాదా. తు౧ అంటా సెడాబడా తిట్టేస్తి. కానీ ఆమింద రాను రాను నాగ్గూడా బిడ్డపైన మమకారం పెరిగె. అదీ మంచిదే గదా. కట్టుకున్నోడే అట్టా అంటావుంటే నాకు మాత్రమేమి అనిపించె. కానీ సూసి సూసి ఈ బండిడు కండలు పరామొగోడి కింద యట్ట దోస్తు సెప్పు! రోంత గిలిపడితి. అయినా యింకో దినం యాదన్న గోడు వసే గొడ్డుదానా. నీకు రెండు నెలలు టైం. అంత లోపల గనక నీకు ముట్టాగిందా సరేసరి. లేకుంటే నిన్నొదిలేస్తానని. మారు మనువు గూడా సేసుకుంటానని. దాంతో నేను పంతం పడితి. గొడ్రాలు అనే మచ్చ పోగొట్టుకోవాలనుకుంటి".

వొగ దినం మద్దేనం యాదన్నగోడు నాలుగు కంజు పిట్టల్ను, రెండు కుందేళ్ళను కొట్టకొచ్చ. కుందేళ్ళను ఆయప్ప సేతబట్టుకునె. కంజు పిట్టల్ను నాకిచ్చ ... 'వీట్ని ఎత్తకపొయ్యి పల్లెల్లో దిరిగి అమ్మకరా' అనె. వాటి జతకు నేనల్లిండే కొన్ని తాటి బుట్టలు, ఈతాకుల బొమ్మలు, పూసలు, దారాలు ఎత్తుకుంటి. వొగ తాటాకు బుట్టలో పెట్టుకుంటి.

"సూదులే దబ్బనాలే, బొమ్మలే మొల్తాల్లే. కంజు పిట్టలే" అంటా బాల మోళ్ళపల్లె, పచ్చార్ల, శ్రీరాంపురం అన్నీ తిరగతా వొగొగిటే అమ్మతావస్తి. సేతికి రెండు కాసులూ రాబట్టె.

నోటి నిండా అంత దుగ్గుపుల్ల, తంబకర్ర యేసుకోని నమల్తా, సేతిలోటివి అమ్ముకుంటా నడస్తావుంటి. పొద్దుపొయ్యే గుందికి అన్నీ అమ్మేసి, అనాక మసకలు పడే లోపల ఇల్లు సేరుకుందామని జాండ్లదారిబడితి. అట్లా బిరీనా నడస్తా నూనేపల్లి కాడికొస్తి. అక్కడ వొగ కటవుండె. అది శ్యానా బిశాంబరంగా వుండె. ఆడికొస్తి. సరిగ్గా అక్కడెదురుపడె అజ్జప్ప. కండలు తిరిగిన వళ్ళు. కోడి కత్తి మీసాలు. ఉసిరి గెడ్డం. కొప్పు మాదిరి ముడసి వదిలేసిండే గిరదాల జుట్టు, దానికి ఎఱ్ఱ సీటీ తల గుడ్డ. మెడలో తాయెత్తు. రెట్టకు రాగి కడిము. సేతికి కంకణం. పిక్కల్దాకా వొగ ఎర్రగళ్ళలుంగీ కట్టిండాడు. నడుంకు రెండు మూడు పొరవుల తిత్తుండే నల్ల బెల్టుయేసిండాడు. మడిసి భలే మోపుగా వుండాడులే.

"ఏమమ్మీ నాంచారీ! యాడ బొయింటివే సందేల బసివే" అంటా అడిగె.

"మా మొగోడు కంజులమ్మకరమ్మంటేను, దట్ల పల్లెలపైన పోయింటిలే." తంబకర్ర నమల్తా సెప్పి.

"యింత పొద్దు పొయినాంకా యింటికి బోతావుండావుగదా. నీ మొగుడేమనడా." యెగసెక్కాలాడతా అనె అజ్జప్ప.

తంబకర్ర ఎంగిలి తుపుక్కున నేల మీందుంచి కిలాకిలా నవ్వితి. "ఏమనుకుంటాడు వోడి జిమ్మడ." అంటి.

"రేత్తిరికి రాకపోయినా ఏమనడా?" అనె.

"ఊహూ౦..." అంటినేను.

"సరే. నేను పీలేరు టెంటుకు సిల్మాకు బోతావుండా వస్తావా?" అనె.

"నువ్వు పిల్చకపోతే రానంటినా ఏందీ?" అంటి.

ఆ సందేళ అట్ట యిద్దరమూ, కుశాలగా సెట్టాపట్టాలేసుకోని సంత గేటుకాడుండే టెంటుకు సిల్మాకు బోతిమి. అదేదో ఎంటీవోడి సిల్మా. భలే వుండిందిలే. ఆడనే యిద్దరికీ మాటా మాటా కుదిరె. మొణుసు మొణుసు కలిసె. యిద్దరమూ వొగ్గిటైపోయి నేరుగా క్రాసురోడ్డుకాడికొస్తిమి. ఎనుకూ ముందు సూడకండానే తిరపతి బస్సెక్కేస్తిమి. కొండెక్కి ఎగవ తిరపతి సేరుకుంటిమి. సామిని జూస్తిమి. అనాక ఆడనే వారం దినాలుండిపోతిమి. సేతల్లో కాసులు కరిగిపాయ. దాంతో దొంగల బండెక్కి ఇల్లు సేరుకుంటిమి. అబ్బుటికే యిసయం ఊరంతా పాక్కిపోయి పాతబడిపోయిండె. మేం ఇల్లు సేరుకున్న రేత్తిరే పెసిరెంటుని బిలిపించి యాదన్న పంచాయితీ బెట్టించె. ఆ పంచాయితీలో యాదన్న నన్ను ఏలుకోననె. నన్ను మనువాడినప్పుడు యిచ్చిండే రెండు వేల ఓలితిరిగి కట్టివ్వమనె. అజ్జప్ప సరేననె. ఆ రెండు వేలూ వారం లోపల నా దెగ్గరివ్వండి అనె గంగి నాయుడు.

కన్నకష్టాలుబడి ఎట్లనోవొగట్ల రెండు వేలు తీసుకొచ్చి గెంగి నాయుడి సేతిలోపోసె అజ్జప్ప. అందులో అయిదొందలు మాత్రం యాదన్నకిచ్చి మిగిలింది గెంగినాయుడు మింగేశ. అనాక అజ్జప్పతో నా సంసారం రెండేండ్లు బాగానే సాగె. అయినా నాకు సంతు గలగలే. ఎన్నెన్నో దేవలాలు తిరిగితి. దేవతలకు మొక్కితి. మళ్ళా మీర్లుదీసి గడితి. ముడుపులు గడితి. కడాకు చెర్లోపల్లె బాలరెడ్డెమ్మ దేవతకూ మొక్కుకుంటి. అయినా సంతు గలగలా. సొరకాయల పేటలో మొగ బిడ్డలు పుడతారంటా ఆకు పసురు పోస్తాది సూడు వొగ ముసిలామె. ఆమె దెగ్గిరికి బోతి. ఆమె పోసే పసురాకు గలాసులు గలాసులు మింగితి. దాంతో మొగ బిడ్డెగాదు గదా. కనీసం నెల నెలా వచ్చే ముట్టు కూడా ఆగలే. పైగా కడుపంతా సెడిపోయి బేదులు పట్టుకుండె. ఆ బేదులు తగ్గేదానికి నెల బట్టె.

కత మళ్ళా మొదిటికొచ్చె.

లోకం గొడ్రాలా అనబట్టె. గొడ్డుబోతుదానా అంటా పొడస బట్టె. ఆడ కొజ్జా అంటా ఎగతాళి చేయబట్టె. లోకులు కాకులై పొడిసిరి. ఆ మారు మొగుడూ అట్టే అనబట్టే. అది సాలక దినమ్ము తాగేసొచ్చేది. నాకూ తాగిపిచ్చేది. ఆమింద సితకబాదుడు బాదేది. ఆ అజ్జప్పగోడికి ఏమూదేవి పూనిందో ఏమో. వొంగ బెట్టి గుద్దతావుండె. పిడి గుద్దులు గుద్దతావుండె. గొడ్డును గుదిమినట్ట గుదమతావుండె. వళ్ళంతా గదుములు గట్టుకోని బోతావుండె. "తుఁ. ఈ పాపిష్టి మొగోళ్ళంతా యింతే." అనుకుంటి.

ఈయిసయం గెంగి నాయుడికి ఎట్ల తెలిసినోతెలిసె. అజ్జప్పను పిలిపించె. "వొరే, నీ పెండ్లాము గడ్డిపోచకూడా ఎలమొలవని సవుటి పఱ్ఱు. సవుటి నేలను నమ్ముకోని పంట బెడితే కడుపు నిండుతుందా? సంతాన యోగమేలేని ఆడదానికి కడుపు పండుతుందా? వొగ అచ్చటా ముచ్చటా? దాంతో ఏం సుఖపడతావురా. వొదిలెయ్యి." అంటా పుల్లెగేశ. మంటరాపాడె. అదిరయ్యమంటా పైకి లేశ. యింగేముండాది? ఆ అజ్జప్ప గోడు అన్నాయంగా నన్ను బయటికి

తోసేశ. నాకేమీదారీ తెన్నూ తెలీలా ... మా గుడిసెకే తిరిగొస్తి, నేను యిట్లొస్తానే వోడు యింగొగదాన్ని కట్టుకుండె.

కాలం గడిసి పోతావుండె. నాకు వొంటరి బతుకు నరకంగా వుండె. కూతురి బతుకు బండలైపోయినందుకు మా అయ్య కుమిలి పోతావుండె. ఆయప్పకదే మనో యాదిగావుండె. ఉడిగినేల అయ్యకు సాయంగా నిలబడితి

బుట్టలల్లితి, బొమ్మలల్లితి. ఆడోళ్ళు వాడే తిలకం సీసాలు, పౌగడ్ర డబ్బాలు, అద్దాలు, పిన్నీసులు అన్నీ సేర్చుకుంటి, వాట్నెత్తకపొయ్యి ఊరూరు తిరిగి అమ్మకొస్తావుంటి.

ఊర్లో జనం "బిడ్డెలు లేకపోతే మాత్రం ఏమి. నాంచారి కష్ట జీవిరా" అండ్రి.

ఇట్ల నేను వంటి దాన్నయి పొయ్యి వగరస్తా అగసాట్లు బడతా వుంటే ఆ గెంగి నాయుడు గాడుండ్లా వాడికి పరమానందంగా వుండె. యింగ నన్నా నా కోరిక తీర్చదా అనుకుంటావుండె. వొగదినం, మా ముసిలోడులేని సందు జూసుకోని అసర సందేళకాడ గుడిసెలో జొరబడె. మిడిమేళంగా వచ్చి మిందబడె.

అబ్బయ్యా నేను నిజ్జంగా సెప్తాండ, నా బిడ్డెమింద సెయ్యేసి సెప్తాండ. నాకు వళ్ళు అగ్గయిపాయ. కండ్లు సింతనిప్పులాయ. నల్లనాగుబాము మాదిర్తో పైకి లేస్తి.

"తూ ... దర్బేసి నా కొడకా. ధన్‌గర్ నా కొడకా. పరా ఆడది వొగ సెల్లిరా, వొగ తల్లిరా ... నన్ను బట్టుకునే బదులు నీయమ్మను బట్టుకో, నీయక్కని బట్టుకో. నీ కూతుర్ని బట్టుకో. నీ జిమ్మడ జినగా..." అంటా సాపిస్తి మాగువ్వలోళ్ళ బాసలో తిట్టిన తిట్టు తిట్టకండా తిడితి. దాంతో వోడు జెర్రిపోతు మాదిరి మొర్సుకుండె.

"యాడనే నీవంత సొక్కం సంసారివి. యిద్దరితో పడకేసి కాపురం జేస్తివి. నాకు నీతులు సెప్తావ్ లమ్డీ." అంటా వడిసి పట్టుకుండె. వంటి ఆడదాన్ని. నేనేం జేతు సెప్పు. ఆయప్ప సేతిలో వంగిపోతావస్తి. యింక చేసేది లేక ఆయప్పకు వొంగినట్టే వంగితి. వోడు మొత్తంగా నన్ను లొంగదీసుకునేటైంలో నేను చేసేది చేసేస్తి. అంతే వోడు రెండు సేతులూ ముందర బెట్టుకోని, లబలబమంటా, నోరు కొట్టుకుంటా యింటికి పరిగెత్తె. యింగ అబ్బుట్నుంచీ నాకల్లా కన్నెత్తయినా సూసే ధైర్నం సెయ్యలా.

ఇట్ల వగిసి దాన్ని వంటిగా అగసాట్లు బడతావుంటే, సూడలేక మా అయ్య ఎక్కన్నించో, వొగ కోర పిల కాయను దెచ్చి నాకు మళ్ళా మనువు జేశ.

ముచ్చటగా జరిగిన నా మూడో మనువుతో బాగానే సాగిపోతావుండె. అంతవరకూ గొడ్డుబోతు, ఆడ కొజ్జా అనిపించుకున్న నాకు కడుపు కూడా పండె. ఇద్దో ఈ సంకనుండే పిలగోడు బుట్టె. వీడిదంతా వోళ్ళ నాయన పోలికే, సూడబ్బయ్యా. తెల్లంగా సక్కంగా నిమ్మ పండు మాదిరుండాడు బిడ్డ.

వోడి మాటెత్తుకునే గుందికి ఎట్లనగతా వుండాడో సూడు. నా నల్ల పూసల పుస్తె బట్టుకోని ఊపి ఊపి నొగతావుండాడు ఎర్రి నా కొడుకు.

అట్ల సూస్తాండంగానే పిల్లోడికి రెండేండ్లపాయమొచ్చె. మమ్మల జూసి అట్లన్నోళ్ళ నోళ్ళు ఇట్లనబట్టె. ఊర్లో అందరికీ సంతోసమాయ ఒక్క గెంగినాయుడికి దప్ప.

వద్దిగ్గా, గుట్టుగా సంసారం జేసుకుంటా వున్న మమ్మల జూసి ఆయప్ప వోర్సుకోలేకపాయ. కండ్లళ్ళో నిప్పులు బోసుకునె. వొగ దినం ఊర్లో అందర్నీ కూడేశ. మద్దిస్తం చేశ. "రైతుల మద్దెన నీ గుడిసుండేదానికిలే." అనె. ఊర్లో వోళ్ళకవమానమనె. మాకు మరేదగాదనె. మిగిల్న ఎరుకలోళ్ళతో బాటే, నాంచారీ బతకాలనె. వారం దినాల్లోపల గుడిశ పెర్కోనిబొయ్యి వోళ్ళతోబాటె కడాన గుడిసేసుకోమని తీర్మానించె. అట్ల లేదంటే గుడిశ పీకించేస్తాననె. జాస్తీ మాట్టాడితే అగ్గిపెట్టిచ్చేస్తానని. దానికి మాయయ్య భయపడిపోయి, యిద్దోకడాన ఈ గుడిసేసిచ్చ. అట్ల యింక రెండేండ్లు జరిగె.

ఆ సంవత్సరం ... ఈ పక్క వాన సినుకే బడలా. కరువు బెట్టేశ. రైతులంతా నెల్లూరు సీమకు వలసలు పోబట్రి. భూమీ పుట్రా వున్న రైతులే అట్ట పలస్తరంబోతావుంటే మా యట్టోళ్ళ సంగతి జెప్పాల్నా. అందునా పలస్తరం బోయేది మాకు అలబాటే. మేమూ గుడిసెలు బీగా లేసుకోని ఆ నెల్లూరు సీమకే బోతమి. ఆడ పల్లెల్లో పూసలు దారాలు బొమ్మలు అమ్ముకుంటా కాలం గడిపితిమి. ఆడనే వొగ అడివి మొగదాల డేరాలేసుకుంటిమి. మేం అక్కడ చేరిన కొన్ని దినాలకు మామాదిరే యింకో గువ్వలోళ్ళ గుంపు ఆడికే వచ్చి డేరాలేసిరి. వోళ్ళకూ మాకూ నేస్తాలు గుదిరె. ఆ నేస్తాలే నా కొంప ముంచె. వోళ్ళు మా ఆయన సొంతూరోళ్ళంట. ఆ గుంపులో మా ఆయన మేనత్త కూతురంట వొగమిటుకులాడి. మా ఆయన పైన కన్నేశ. సిన్నంగా వోళ్ళ డేరాకు దీసకపొయ్యి కల్లు దాగిస్తా వచ్చె. వోళ్ళ మొగోళ్ళు కొట్టకొచ్చిన పిట్టల మాంసం రుసిగావండి పెట్టె. కొన్ని ఎండి తునకలు కాల్చి పెడతావచ్చె. అట్ట అరసేతిలో వైకుంటం సూపించేశ. ఈయప్ప బెమిసిపాయ.

"వచ్చెయ్ మనూరికి, వోళ్ళల్లో వొగ అయినోళ్ళా పోయినోళ్ళా, యేదన్నా జరగరానిది జరిగితే ఆడ నీకు ఎవురుండారని, వచ్చెయ్" అంటా అది యితబోదచేశ. ఈయప్ప తలొంచేశ. దాంతో, నన్నూ నా బిడ్డను నట్టేట్లో తోసేసి సెప్పా పెట్టకండా వోళ్ళతో బాటు యెళ్ళిపాయ. ఏంజేతును? ఏ మొగోడొచ్చినా నా వంటి సొంపులే జూశగానీ నా మొఖుసును జూడలే. నాకూ వొగ యిదుంటుందని అనుకోలే.

నా బతుకిట్ట తెల్లారే గుందికి మా అయ్యకు అదే మనోయాదిగా మారిపాయ. కడాకు ఆయనా కాలమైపాయ. ఆనాక నన్ను చేసుకుంటామని శ్యానా మందే వచ్చిరి. వోళ్ళ ముండమోయా. ఎవుడొచ్చినా కొన్ని దినాలె గదా. ఈ వంట్లో బిగువుండేదాకానేగదా. మోజు తీర్నాకా, ఆ బిగువు తగ్గినాకా తినేసి నాకేసిన పుల్లాకు మాదిర్తో నన్నూ యిసిరి పారేస్తరుగదాని

నేనొప్పుకోలా.

యింకొగ యినయం కూడా సెప్తావుండా యినుకోండబ్బయ్యా. యిడమర్సిసెప్తాయినుకోండి. మళ్ళా మళ్ళా సెప్పనబ్బయ్యా...

అబ్బయ్యా. ఆ మోసకారి నా కొడుకుండ్లా నా మూడో మొగుడు ... కొన్ని దినాలకు మళ్ళా నా దెగ్గిరికొచ్చ. నిన్ను ఏలుకుంటానే అనె. ఆ రెండు కుడతలు అమ్మేసి నాతో వచ్చెయ్ అనె. వాడికినా చేనిపైనే మొజుసు గానీ నా పైన కాదని తెలస్తావుండ్లా, అందుకే పోరా నా కొడక అంటి. వోడెల్లిపాయ.

అదే మాదిరిగా తొలి మొగుడు యాదన్న గోడొచ్చె నిన్ను ఉంచుకుంటాననె. ఉచ్చల్లో తడిపిన పొరకతో కొడతాను సూడు అంటి. వాడు మళ్ళా తిరిగి చూడలా అనాక అజ్జప్ప గోడువచ్చె. అదే మాదిరనే. వాడికీ రెండు వడ్డిస్తే వోడూ పాయ.

అబ్బయా బాగాయినుకోండి యిప్పుడు మళ్ళా సెప్తాండా "నేనేమి తప్పు సెయ్యనేదబ్బయా! నేను నిప్పులాంటిదాన్నే. ఆ అంతే అబ్బయా. మా కులంలో మొల్తాడు గట్టిన పెతి మొగ నా కొడుకూ ఆడదాన్ని వొగ వస్తువు మాదిరి సూస్తాడు. మాసిపోతానే వదిలేసే కట్టు గుడ్డ మాదిరి, కట్టుకున్న దాన్ని వదిలేస్తాడు. మొలకు మొల్తాడు మార్చుకున్నిట్టు ఆడదాన్ని మార్చేస్తాడు. ఇట్టే వుంటే మా బతుకులెప్పుడు బాగపడతాయో ఏమో. మొగోడి సేతిలో ఆడది ఇట్ట ఎన్ని దినాలని అణగారి బతకాల్నో ఏమో? సెప్పండబ్బయ్యా సెప్పండి. ఇట్ట ఎన్ని దినాలు? ఎన్ని తరాలు?

ఇయన్నీ సెప్తావుంటే కల్లు తాగినా ఆగలా ... దుఃఖమొచ్చేస్తా వుండాది. వలవలా యేడ్చాలనిపిస్తావుండాది. ఏడస్తానబ్బయా. రొంత సేపు ఏడస్తా. మళ్ళా సెప్తా.

వొరే ... అన్నె కారి పిలగోడా ... ఏమిరా ... మెడలో నల్లలు పెరికేస్తివి ... పుస్తి పట్టుకొని చెయ్యి ఊగిస్తా వుండావు. దాంట్లో వుండే నల్ల పూసలు జల జలా రాలి కింద పడతావుండాయే ....

అయినా మంచి పనే చేసినావులే నాకు వొగ మొగుడు కాదు. ఇది వొగడు గట్టిందీ కాదు. ఇది మెడలో కట్టినోళ్ళకే దీని పైన గౌరవం లేనప్పుడు. యిది నా మెడలో మాత్రం ఎందుకు? పోతేపోయిందిలే ఆడుకో ... బాగా ఆడుకో ... దాన్ని నేలపైన కొట్టి కొట్టి ఆడుకో ... కసితీరా ఆడుకో ఆనందంగా ఆడుకో పో ... అంతే."

● *ఈ కథ 4-1-1998, విశాలాంధ్ర దిన పత్రికలో 'ఓలి బతుకులు' అన్న పేరుతో ముద్రింపబడింది* ●